అడ్డగోలుగా నిర్మాణాలు

25వ వార్డులో అనధికార అంతస్తులు

- సీతంపేట రాధాకృష్ణ ఆలయ సమీపంలోని శ్రీనివాస వీధిలో 210, 168 గజాల స్థలంలో రెండు వేర్వేరు ప్లాన్‌లు తీసుకున్నారు. మొత్తం సుమారు 370 గజాల స్థలంలో మూడు భవనాలు నిర్మిస్తున్నారు. జీ ప్లస్ 3కి అనుమతి పొంది అదనంగా మరో అంతస్తు నిర్మించారు. ఇందులో 25 అడుగుల స్థలంలో మూడంతస్తుల ఇళ్లు నిర్మించడం విశేషం.
- సీతంపేట నాయుడు వీధిలో 10 అడుగుల రోడ్డును 30 అడుగుల రోడ్డుగా చూపించి స్టిల్ట్ జీ ప్లస్ 2 నిర్మించారు. దీనిపై స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.
- సీతంపేటలో గ్రీన్ గార్డెన్స్ **అపార్ట్‌మెంట్ వద్ద** 50-63-5 డోర్ నంబర్ పక్కన **స్టిల్ట్ జీ ప్లస్ 2కు** అనుమతి తీసుకుని అదనంగా **మరో అంతస్తు నిర్మించారు**. దాదాపు ఈ ఇంటి పను**లు పూర్తయినప్పటికీ** టౌన్ ప్లానింగ్ సిబ్బంది నోరు **మెదవడం లేదు.**
- సీతంపేట మెయిన్ రోడ్డులో **50-81-4 పక్కన** జీ ప్లస్ 2గా ఉన్న **పాత కమర్షియల్** బిల్డింగ్‌పై అనుమతి లేకుండా **అదనంగా మరో** అంతస్తు నిర్మించారు. దీనిపై **ఫిర్యాదులు,** పత్రికల్లో వార్తలు **ప్రచురితమైనప్పటికీ** అధికారులు చర్యలు చేపట్టలే**దు.**


సీతంపేట శ్రీనివాస వీధిలో అనుమతి లేకుండా నిర్మించిన అదనపు అంతస్తు

- 25, 43 వార్డుల్లో అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు
- కూటమి నాయకుల సిఫార్సులతో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు
- టీడీఆర్ ఎగ్గొట్టడంతో జీవీఎంసీ ఆదాయానికి గండి
- ఏడాదిలో ఒక్క అక్రమ నిర్మాణంపైనా కానరాని చర్యలు
- టౌన్ ప్లానింగ్ విభాగం తీరుపై విమర్శల వెల్లువ


సీతంపేట మెయిన్ రోడ్డులోని కమర్షియల్ బిల్డింగ్‌పై అనుమతి లేని అదనపు అంతస్తు


సంగం ఆఫీస్ రోడ్డు జగన్నాథపురంలో అక్రమ నిర్మాణం


అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద రెండడుగుల రోడ్డులో బహుళ అంతస్తుల భవనం

సీతంపేట: జీవీఎంసీ 25, 43 వార్డుల్లో అనధికార నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కూటమి నాయకుల సిఫార్సులతో టీడీఆర్ లేకుండానే అదనపు అంతస్తులు నిర్మించేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించనప్పటికీ, ఉత్తరలో ఇతర నియోజకవర్గాల ఎమ్మెల్యేల సిఫార్సులతో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. కూటమి నాయకులు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ టీడీఆర్ రూపంలో జీవీఎంసీకి రావాల్సిన లక్షలాది రూపాయల ఆదాయానికి గండికొడుతున్నారని స్థానిక ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీటిపై చర్యలు తీసుకోకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇదే అదనుగా భవన యజమానుల నుంచి సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీ మొదలు జోన్ ఏసీపీ వరకు పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నట్టు బహిరంగ ఆరోపణలున్నాయి.

విజిలెన్స్ విభాగం ఎక్కడ..?

అక్రమ నిర్మాణాలను గుర్తించడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రత్యేక విజిలెన్స్ విభాగం ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ విభాగం ఎక్కడా అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న దాఖలాలు లేవు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినా, పత్రికల్లో వార్తలు ప్రచురితమైనా.. టౌన్ ప్లానింగ్ సిబ్బంది నోటీసులు జారీ చేసి చేతులు దులిపేసుకుంటున్నారు. గతేడాది కాలంలో ఒక్క అక్రమ నిర్మాణాన్ని కూల్చిన సందర్భం కనిపించలేదంటే అతిశయోక్తి కాదు. దీంతో స్థానిక నాయకులను, టౌన్ ప్లానింగ్ సిబ్బందిని మేనేజ్ చేస్తే రూ.లక్షల్లో టీడీఆర్ ఎగ్గొట్టి ఎంచక్కా అదనపు అంతస్తు వేసుకోవచ్చన్న భావనలో భవన యజమానులు, బిల్డర్లు ఉన్నట్టు తేటతెల్లమవుతోంది. జీవీఎంసీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు దృష్టి సారించి 25, 43 వార్డుల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని పలువురు ఫిర్యాదుదారులు కోరుతున్నారు.

43వ వార్డులో ప్లాన్‌కు విరుద్ధంగా..

- సంగం ఆఫీస్ నుంచి జగన్నాథపురం రోడ్డులోని 45-33-25 డోర్ నంబర్ పక్కన జీ ప్లస్ 2కు అనుమతి తీసుకుని అదనంగా మరో అంతస్తు నిర్మించారు.
- అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు జగ్గారావు బ్రిడ్జి వద్ద రెండడుగుల రోడ్డులో నాలుగంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. ఇటువైపు టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది కన్నెత్తి చూడకపోవడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీ ఇచ్చిన అనుమతులకు సంబంధించిన ప్లాన్ ప్రదర్శించాల్సి ఉన్నా.. అటువంటిది ఇక్కడ కనిపించడం లేదు.
- నందగిరినగర్ చెక్కుడురాయి బిల్డింగ్ రోడ్డులో 44-34-11/ఏ పక్కన స్టిల్ట్ జీ ప్లస్ 2 భవనం నిర్మిస్తున్నారు. దీని సెట్ బ్యాక్స్ ప్లాన్‌లో చూపిన విధంగా వదల్లేదని, రోడ్డు వైపు సెట్ బ్యాక్ వదలకుండా పిల్లర్లు ముందుకు వేసి నిర్మించారు. సెల్లార్‌లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని నిబంధన ఉన్నప్పటికీ.. దానిలో కూడా నిర్మాణాలు చేపట్టారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండండి


పదో తరగతి విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈవో రామారావు

సీతంపేట: అక్కయ్యపాలెంలోని ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌ను శుక్రవారం ప్రార్థనా సమయంలో మండల విద్యా శాఖాధికారి రామారావు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ఇళ్లు, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌కు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలని సూచించారు. పదో తరగతి గదికి వెళ్లి విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రతి సబ్జెక్టులో ప్రతి పాఠాన్ని క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలని సూచించారు. సందేహాలుంటే పాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయుల గైడెన్స్‌లో ప్రతి ఒక్కరూ మంచి మార్కులు సాధించాలని ఎంఈవో ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయంతి రాధాకుమారి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాలపై అవగాహన


మహారాణి వీధిలో స్థానికులకు సీజనల్ జ్వరాలపై అవగాహన కల్పిస్తున్న జెడ్సీ రాము

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు మర్రిపాలెం పరిధి మహారాణి వీధిలో శుక్రవారం జోన్–5 మలేరియా ఇన్‌స్పెక్టర్ నల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో 'ఫ్రైడే–డ్రైడే'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము పాల్గొని స్థానికులకు సీజనల్ జ్వరాలపై అవగాహన కల్పించారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఫ్రిజ్‌లు, సిమెంటు కుండీలు, పూల కుండీల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని మలేరియా సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో కార్తీక్, జనార్దన్, కిరణ్, మాధవరావు, శివకుమార్, గణేష్‌బాబు, శ్రీను, కనకరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు వైభవుడికి సుప్రభాత సేవ


వైభవ వేంకటేశ్వర స్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

27న రక్తదాన శిబిరం

సీతంపేట: రామాటాకీస్ ఎదురుగా ఉన్న వాయుపుత్ర హెల్త్ క్లబ్‌లో ఈ నెల 27న స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు క్లబ్ డైరెక్టర్ కిలాని గణేష్ తెలిపారు. ఆరోజు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు దాతల నుంచి రక్తం సేకరిస్తారన్నారు. జాతీయ బాడీ బిల్డర్ కిలాని శ్రీనివాసు జ్ఞాపకార్థం ప్రతి ఏటా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని, క్లబ్ సభ్యులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

కిశోరి వికాసంపై అవగాహన


పోస్టర్లు ప్రదర్శిస్తున్న చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. కౌమార బాలికలకు విద్య ప్రాముఖ్యత, సంపూర్ణ ఆరోగ్యం, రుతు పరిశుభ్రత, పౌష్టికాహారం, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టం, ఆత్మ రక్షణ, యోగా, జీవనోపాధి తదితర అంశాలపై చిన్నారుల తల్లిదండ్రులకు అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం కిశోరి వికాసం పోస్టర్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మౌలాబీబీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కృష్ణా డిగ్రీ కళాశాలను సందర్శించిన ఆర్జేడీ


ఆర్జేడీ కృష్ణాజీతో కళాశాల అధ్యాపక బృందం

మద్దిలపాలెం: జోన్ 1, 2 ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి డాక్టర్ పి.వి.కృష్ణాజీ శుక్రవారం డాక్టర్ వీఎస్. కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, వివిధ విభాగాల అధిపతులు, వైస్ ప్రిన్సిపాల్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్జేడీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధులకు విధిగా హాజరై విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని కోరారు.

ఆకట్టుకున్న 'సుందరకాండ'


హరికథ వినిపిస్తున్న భాగవతారిణి నిర్మల

మద్దిలపాలెం: మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే హరికథా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్. రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు ప్రారంభించారు. తొలిరోజు విజయనగరానికి చెందిన భాగవతారిణి కాళ్ల నిర్మల సుందరకాండపై హరికథను శ్రావ్యానందకరంగా సాగించారు. 'సుందరే సుందరో రామః, సుందరే సుందరః కపిహి, సుందరే సుందరి సీత సుందరి సుందరః' అనే కీర్తనతో తన గానాన్ని ప్రారంభించిన నిర్మల, రాముడు సుందరుడు, సీత సుందరి, లంక సుందరం, రామాయణం సుందర కావ్యం అంటూ సుందరకాండ మహాత్మ్యాన్ని వివరించారు. మధ్యమధ్యలో త్యాగరాజ కృతులను జోడించి, సుమధురంగా ఆలపించి ప్రేక్షకులను కథలో లీనమయ్యేలా రక్తి కట్టించారు.

- హరికథా ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం జేజే నారాయణ భాగవతార్ 'దాన వీర శూరకర్ణ' కథను వినిపించనున్నారు.

బర్మా కాందిశీకుల సమస్యలపై వినతి


జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచందర్‌కు వినతిపత్రం అందిస్తున్న సంఘాల ప్రతినిధులు


కంచరపాలెం: జీవీఎంసీ 48, 49, 55 వార్డుల్లోని బర్మా కాందిశీకుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం బర్మా–ఆంధ్రా కాందిశీకుల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి జి.అరుణబాబు, అనుబంధ సంఘాలు, బర్మా కాందిశీకుల పునరావాస సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్‌ను నగరంలో కలిసి బర్మా కాందిశీకుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. విశాఖ జిల్లాలో బర్మా కాందిశీకుల కుటుంబాలకు గృహాల నిర్మాణం, వ్యాపారం కోసం కేటాయించిన భూములపై జిల్లా కలెక్టరేట్ జారీ చేసిన ఉత్తర్వులను నేటికీ అమలు చేయకుండా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం బర్మా కాందిశీకులకు కేటాయించిన భూములను భూ కబ్జాదారులు దోచుకుంటున్నారని అరుణబాబు తెలిపారు. ప్రభుత్వ పరంగా న్యాయం చేయాలని కోరారు. రామచందర్ స్పందించి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాందిశీకుల భూములు అన్యాక్రాంతమవుతుండటం చూసి విస్మయం చెందారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడి తక్షణమే బర్మా కాందిశీకులు కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘాల నాయకులు ధారణ సత్యనారాయణ, బంగారి భీమా, మాటూరి కృష్ణకిషోర్, గోపి, వి.ప్రసాద్, రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీలకు మురళీనగర్ క్రీడాకారుల ఎంపిక


రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మురళీనగర్: మురళీనగర్ స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందుతున్న పలువురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 19, 20 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్న స్విమ్మింగ్ పోటీలకు మురళీనగర్‌తోపాటు నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన 30 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా స్థానిక వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని స్విమ్మింగ్ పూల్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పార్కు కమిటీ సభ్యులు క్రీడాకారులను అభినందించారు. వీరికి పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ టీ షర్టులు అందించారు. కార్యక్రమంలో పార్కు కార్యదర్శి పీవీఎస్ఎన్ రాజు, కార్యవర్గ సభ్యులు రోణంకి నాగేశ్వరరావు, ఎల్‌వీ సుధాకర్, స్విమ్మింగ్ పూల్ కోచ్ రామారావు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలపై తీర్మానం


సేవా కార్యక్రమాలపై చర్చిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆగస్టులో నిర్వహించనున్న సేవా కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి అధ్యక్షతన శుక్రవారం వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని వనితా భవన్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులంతా సేవా కార్యక్రమాలపై ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించారు. ఆగస్టు 4న సర్వసభ్య సమావేశం, 15న స్వాతంత్ర్య దినోత్సవం, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశం, 24న ఉచిత వైద్య శిబిరం, 26న మదర్ థెరీసా జయంతి నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఆర్‌సీ-5 యు.శుభ, వనితా వాకర్స్ కార్యదర్శి ఎం.జయ, కోశాధికారి కె.భానుమతి, సంయుక్త కార్యదర్శి జి.శిరీషలత, సంయుక్త కోశాధికారి ఎం.ప్రమీల రావు, బులిటిన్ ఎడిటర్ సిహెచ్.పద్మావతి, సీనియర్ సభ్యులు జి.మంగాదేవి, కమిటీ సభ్యులు సురేంద్ర కౌర్, పి.సుభద్ర పాల్గొన్నారు.

ఆదమరిస్తే కాలువలోకే..!


కప్పరాడ నుంచి రాంజీ ఎస్టేట్‌కు వెళ్లే దారిలో ప్రమాదభరితంగా కాలువ

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు **రాంజీ ఎస్టేట్** కొండవాలు ప్రాంతంలోని పలు వీధి **కాలువలు** ప్రమాదభరితంగా మారాయి. వీటిపై **వేసిన సిమెంట్** దిమ్మెలు శిథిలావస్థకు చేరాయి. కప్పరాడ ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారిలోని కాలువలపై గల సిమెంటు దిమ్మెలు పగిలిపోయి రాడ్లు పైకి కనిపిస్తున్నాయి. ఈ సమస్యపై వార్డు కార్పొరేటర్‌కు, జోన్-5 ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా.. పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని చెబుతున్నారు. వీధిలైట్లు సక్రమంగా వెలగని సమయంలో కాలువల్లో పడుతున్నామని పలువురు స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి శిథిలమైన కాలువలను బాగుచేయాలని కోరుతున్నారు.

డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ

ఆరిలోవ: నేరాల నియంత్రణలో డ్రోన్ టెక్నాలజీ వినియోగాన్ని పెంపొందించే లక్ష్యంతో అనకాపల్లి జిల్లా పోలీసులు కీలక అడుగు వేశారు. కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో 25 మంది పోలీసులకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో మూడో విడత డ్రోన్ శిక్షణ శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజుల శిక్షణలో సైబర్ క్రైమ్, సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్ బెండి వెంకటరావు పోలీసులకు సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, విపత్తుల సమయంలో సహాయక చర్యలతో పాటు ఇతర పోలీస్ విధులను సమర్థవంతంగా నిర్వహించడానికి అత్యాధునిక డ్రోన్ కెమెరాల వినియోగంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డ్రోన్ టెక్నాలజీ నేర నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. దీని ద్వారా జూదం, బహిరంగ మద్యపానం వంటి వాటిపై నిఘా పెట్టవచ్చని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొన్నారు. అసాంఘిక శక్తులను నియంత్రించడానికి డ్రోన్లను విస్తృతంగా వినియోగించనున్నట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్య కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో జరిగే మోసపూరిత, అనుమానాస్పద కార్యకలాపాలను ముందుగానే గుర్తించడానికి డ్రోన్ల ద్వారా నిఘా పెడుతున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా చైన్‌స్నాచింగ్, ఈవ్ టీజింగ్ వంటి వాటిని నియంత్రించడానికి, రోడ్డు ప్రమాదాలను గుర్తించడానికి కూడా డ్రోన్‌లను వినియోగిస్తున్నామని ఆయన వివరించారు.

ఏయూ బీవోఎస్ చైర్మన్‌గా చిట్టిబాబు


వీసీ నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న చిట్టిబాబు

మద్దిలపాలెం: ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల, కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు ఎస్. చిట్టిబాబు బోర్డు ఆఫ్ స్టడీస్ (బీవోఎస్) చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్ శుక్రవారం ఆయనకు అందజేశారు. ఇప్పటివరకు బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఉన్న ఆచార్య కేవీ రమేష్ నుంచి చిట్టిబాబు బాధ్యతలను స్వీకరించారు.

పెదవాల్తేరు పోలమాంబకు సారె సమర్పణ


కరకచెట్టు పోలమాంబ అమ్మవారికి ఊరేగింపుగా సారె తీసుకువస్తున్న భక్తులు

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం సారె సమర్పణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 10.30 గంటలకు మద్ది వారి పెద్దింటి నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. కోలాటాలు, సన్నాయి వాయిద్యాలతో కోలాహలంగా సాగిన ఈ ఊరేగింపులో చినవాల్తేరు, శివాజీపాలెం, ఆదర్శనగర్ ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి గుడికి చేరుకున్న భక్తులు పోలమాంబకు సారె సమర్పించి, దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం ఈవో గాయత్రి పటిష్ట ఏర్పాట్లు చేశారు. విశాఖ జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ, 20వ వార్డు కార్పొరేటర్ ముప్పల లక్ష్మీ సురేష్, పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి చర్యలు


ఆశ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు


గ్రీవెన్స్‌కు హాజరైన ఆశ కార్యకర్తలు

సీతంపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లాలో పనిచేస్తున్న ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆశ కార్యకర్తల నుంచి వినతులు తీసుకుని, తమ స్థాయిలో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని, రాష్ట్ర స్థాయిలో ఉన్న సమస్యలు వారికి పంపిస్తామని తెలిపారు. పనిచేసే చోట ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలన్న ఉద్దేశంతో ఆశ గ్రీవెన్స్ మీటింగ్‌ను ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీపీహెచ్‌ఎన్‌వో ఎం.సత్యవతి, డీసీఎం మణికుమారి పాల్గొన్నారు.

గురుదత్ చిత్రాలు ఆణిముత్యాలు


గురుదత్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో హిందీ క్లాసిక్ చిత్రాల నటుడు, దర్శకుడు గురుదత్ శత జయంతి వేడుకల సమావేశం నిర్వహించారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కాశీ విశ్వేశ్వరరావు, నరవ ప్రకాశరావు గురుదత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుదత్ చిత్రాల్లో మానవ సంబంధాలు, ప్రేమ, కుటుంబ వ్యవస్థ ఉంటాయని తెలిపారు. ఆయన చిత్రాలన్నీ నేటికీ ఆణిముత్యాలని, భాషతో సంబంధం లేకుండా అందరినీ అలరించేవని కొనియాడారు. ఆయన చిత్రాల్లో ముఖ్యంగా ప్యాసా, సాహిబ్, బీబీ, ఔర్ గులాం, ఖాగజ్ కా ఫూల్ అపురూప క్లాసిక్స్‌గా గుర్తింపు పొందాయన్నారు. ప్రపంచ చిత్రాల జాబితాలో తప్పక గురుదత్ చిత్రాలుంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురుదత్ నటించి, దర్శకత్వం వహించి 1957లో విడుదలై సంచలనం సృష్టించిన ప్యాసా చిత్రాన్ని ప్రదర్శించారు. ముందుగా ఇటీవల మృతిచెందిన సినీ నటులు కోట శ్రీనివాసరావు, బి.సరోజదేవికి మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కృష్ణారావు, బి.చిన్నారావు, హుస్సేన్, బాబ్జి పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే విద్యాభివృద్ధి

డాబాగార్డెన్స్: అందరి సహకారంతోనే విద్యాభివృద్ధి జరుగుతుందని ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు తెలిపారు. శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ (సేవా) ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీని వ్యాపారవేత్త పువ్వాడ శేషమస్తాన్‌రావు నిర్వహించారు. మస్తాన్‌రావు తల్లిదండ్రుల చేతుల మీదుగా 80 మంది పేద విద్యార్థులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థి పువ్వాడ శేషమస్తాన్‌రావు కళాశాల అభివృద్ధికి సహకారం అందించడం అభినందనీయమన్నారు. శక్తి సంస్థ ద్వారా కళాశాల అధ్యాపకురాలు పైడి రజని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేద విద్యార్థులను ప్రోత్సాహించడం అభినందనీయం అన్నారు. గురువెల్లి జాబిలి, అధ్యాపకులుఎం.స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ అర్చన, విద్యార్థులు పాల్గొన్నారు.